సమస్యలనేకం.. పట్టించుకుంటేనే పరిష్కారం

- ప్రజావాణిలో అర్జీదారుల ఆవేదన
- కార్యక్రమానికి దరఖాస్తుల వెల్లువ

దరఖాస్తులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబర్ 7: తమ సమస్యలు పరిష్కరించాలంటూ సామాన్య ప్రజలు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయడం షరా మామూలు అన్నట్లుగా మారింది. ప్రతి సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలోనైనా గోడు వెళ్లబోసుకుంటే, ఇక్కట్లు తొలగుతాయేమోనని భావించిన తమకు నిరాశే ఎదురవుతున్నదనే అభిప్రాయం అత్యధిక మందిలో వ్యక్తమవుతున్నది. తమ సమస్యలపై లిఖిత పూర్వకంగా ఉన్నతాధికారులకు నివేదించినా, పరిష్కారం మాత్రం లభించడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటున్న సమస్యలు పట్టించుకుంటేనే పరిష్కారం లభిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమివ్వాలి: కలెక్టర్

కరీంనగర్, అక్టోబర్ 7: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని, అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచరాదన్నారు. పలు శాఖల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై 169 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆయా శాఖల వారీగా వాటిని విభజించి సదరు అధికారులకు అప్పగించగా, వాటిని నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీఆర్‌వో పవన్‌కుమార్‌తో పాటు పలు మండలాల తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఆర్‌సీ ఉత్తర్వులు అమలు చేయాలి

నా కూతురు అతిఫా మెహరీస్ మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్నది. అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా, కూతురు వైకల్యంతో అద్దె ఇళ్ల యజమానులు ఇండ్లు ఖాళీ చేయిస్తున్నారు. మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించడంతో మందులు, ఆరోగ్య పరిరక్షణపై ఉచిత సేవలందించాలని, ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని అమలు చేస్తుందని భావించినా ఇప్పటివరకు ఉలుకూ పలుకు లేదు. దయతో నాకు ఇల్లు ఇప్పించి, నా కూతురు సంరక్షణకు చర్యలు తీసుకోవాలి.

-షేక్ మునవర్, అహ్మద్‌పుర(కరీంనగర్)

అక్రమ భవన నిర్మాణ అనుమతులు రద్దు చేయాలి

నగర శివారులోని సీతారాంపూర్ పరిధిలో తప్పుడు రికార్డులతో పొందిన నిర్మాణ అనుమతులు వెంటనే రద్దు చేయాలి. అసైన్డ్ భూమిలో నుంచి భవనానికి రహదారి ఏర్పాటు చేయడంతో, పట్టా భూముల్లో నిర్మించుకున్న మా ఇళ్లల్లోకి వరద నీళ్లు వస్తున్నాయి. వర్షాలు పడ్డ సందర్భంలో అనేక ఇబ్బందులు పడుతున్నం. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు.

-సీతారాంపూర్ గ్రామస్తులు(కరీంనగర్)

కాలుష్యం బారి నుంచి కాపాడండి

ఆర్టీసీ వర్క్‌షాప్ ప్రహరీ పక్కన ఉన్న మా ఇంట్లోకి అందులోని జనరేటర్ నుంచి విడుదలయ్యే కాలుష్యం వస్తున్నది. ఏడాది కాలంగా ఉన్న ఈ సమస్యపై ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మా ఇంటితో పాటు పరిసర కుటుంబాలన్నీ తరచూ అనారోగ్యం బారిన పడుతున్నయి. దీనిపై కొన్ని మాసాల క్రితం ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసిన. మా సమస్యకు ఇప్పటివరకు పరిష్కారం లభించలే. దీంతో, తిరిగి ఈరోజు కూడా వచ్చి ఫిర్యాదు చేశా.

-నాంపల్లి శంకర్(ఆర్టీసీ వర్క్‌షాప్)

సమస్యలుంటే చెప్పండి.. పరిష్కరిస్తా

- ఇరిగేషన్ మహిళా ఉద్యోగులతో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్: ఎల్ఎండీలో ఇరిగేషన్ మహిళా ఉద్యోగుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తిమ్మాపూర్, అక్టోబర్ 7: ఉద్యోగులు సమస్యలు ఉంటే చెప్పాలని, వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మధ్యాహ్నం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్తుండగా, ఎల్ ఎండీ వద్ద ఇరిగేషన్ మహిళా ఉద్యోగులు కనిపించడంతో ఆగి వారితో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఏలు, ఇతర అలవెన్సులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బతుకమ్మకు ప్రభుత్వం సెలవు ప్రకటించేలా కృషి చేస్తానన్నారు. అంతకు ముందు మొగిలిపాలెంలో దుర్గామాతను దర్శించుకున్నారు. అలాగే, రాంలీలా కార్యక్రమానికి హాజరుకావాలని, క్యాంప్ కార్యాలయంలో ఆయనను ఉత్సవ కమిటీ బాధ్యులు కలిసి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మొరపల్లి రమణారెడ్డి, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, లక్ష్మీనారాయణ గౌడ్, కుంట రాజేందర్ రెడ్డి, గవ్వ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శంకరపట్నం/గన్నేరువరం/మానకొండూర్, అక్టోబర్ 7: నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. శంకరపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో వంద మందికి, గన్నేరువరం మండల కేంద్రంలోని రైతు వేదికలో 37 మందికి, మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో శంకరపట్నం మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మానకొండూర్ ఎంపీడీవో వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలుయాదవ్, నాయకులు నందగిరి రవి, కోండ్ర సురేశ్, ఇర్ఫాన్, గోపు శ్రీనివాస్‌రెడ్డి, సంపత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- యార్న్ డిపోతో వేల మంది కార్మికులకు ప్రయోజనం
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు

మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్ రావు

రాంనగర్, అక్టోబర్ 7: సిరిసిల్ల నేత కార్మికులు 30 ఏళ్లుగా ఎదురు చూస్తున్న యార్న్ డిపోను దసరా కానుకగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. వేములవాడలో యార్న్ డిపో మంజూరుతో సిరిసిల్లలో వేల మంది కార్మికులకు ప్రయోజనం కలుగనుందని తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సిరిసిల్ల నేత కార్మికుల 30 ఏళ్ల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పేర్కొన్నారు. నేత కార్మికుల కష్టాలను చూసి రాష్ట్ర ముఖ్యమంత్రి వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అలాగే విద్యుత్ బిల్లుల బకాయిని కూడా తీర్చారని తెలిపారు. యార్న్ డిపోను వేములవాడలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, డిపో ఏర్పాటుకు తక్షణం 50 కోట్ల రూపాయలు కేటాయించిందని వెల్లడించారు. వేల మంది కార్మికులకు ఉచితంగా యార్న్ లభించడంతోపాటు చేతినిండా పని దొరుకుతుందని తెలిపారు. గతంలో నేత కార్మికులు యార్న్ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి నానా ఇబ్బందులు పడేవారని, వాటిని దూరం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యార్న్ డిపో మంజూరు చేసిందని చెప్పారు. నేత కార్మికులకు టెస్కో ఆధ్వర్యంలో క్రెడిట్‌పై యార్న్‌ను ఇవ్వడంతో పాటు ఉత్పత్తి అయిన వస్త్రాన్ని సైతం టెస్కోనే కొనుగోలు చేయనుందని తెలిపారు. దీంతో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులకు ఎంతో లాభం కలుగుతుందని వెలిచాల రాజేందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. వేములవాడ కేంద్రంగా యార్న్ డిపో మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఇందుకు ప్రత్యేకంగా కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు ఎమ్మెల్యేలకు వెలిచాల రాజేందర్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

9న జిల్లాకు సీఎం కప్-2024 టార్చ్ రిలే ర్యాలీ

కొత్తపల్లి, అక్టోబర్ 7: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ -2024 టార్చ్ రిలే ర్యాలీ ఈనెల 9న జిల్లాలోకి ప్రవేశిస్తుందని, ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, పీఈటీలు, పీడీలు, పలు క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు, విద్యార్థి, యువజన సంఘాలు, నగరవాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9న ఉదయం 7.30 గంటలకు అల్గునూర్ మీదుగా కమాన్ చౌరస్తా, అంబేద్కర్ స్టేడియం వరకు 10 కిలోమీటర్ల మేర రన్ కొనసాగుతుందని తెలిపారు.

బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పర్యవేక్షణ

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 7: పట్టణంలోని బతుకమ్మ సౌళ్ల వద్ద ఈ నెల 10న జరిగే సద్దుల బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక పర్యవేక్షించారు. మహిళలకు అసౌకర్యం కలుగకుండా లైటింగ్ ఏర్పాటు చేయించడంతో పాటు తాగునీరు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, కమిషనర్ సమ్మయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్ రావు, శానిటరీ జవాన్లు ప్రతాప రాజు, ఆరెల్లి రమేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కెనాలలో పడి ఒకరి మృతి

శంకరపట్నం, అక్టోబర్ 7: లింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి వీరయ్య (50) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరయ్య ఆదివారం సాయంత్రం పాడి ఆవుకు గడ్డి కోసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లి, రాత్రి అయినా తిరిగి రాలేదు. భార్య రమ ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అయినట్లు తెలిసింది. అతడి కొడుకులు జగదీశ్, ఆంజనేయులు స్నేహితులతో కలిసి గ్రామంతో పాటు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం అదే గ్రామానికి చెందిన చల్లూరి అనిల్ అనే యువకుడు వీరయ్య గ్రామ శివారులోని ఎస్సారెస్పీ ఉప కాలువలో పడి ఉన్నట్లు తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, వీరయ్య అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. వీరయ్య భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

గునుగు పూలకు వెళ్లి.. బావిలో పడి

కాళిదాసు (ఫైల్)

గన్నేరువరం, అక్టోబర్ 7 : బతుకమ్మ పండుగ కోసం గునుగు పూల కోసం వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందాడు. గన్నేరువరం మండలం జంగపల్లిలో విషాదం నింపిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగపల్లికి చెందిన గుంటుక కాళిదాసు (50) గునుగు పూల కోసం ఆదివారం ఉదయం బయటకు వెళ్లగా మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారుపడ్డారు. తమ పొలం వద్దకు వెళ్లగా అక్కడా లేకపోవడంతో గ్రామంలోని పలు చోట్ల వెతికారు. సోమవారం గ్రామంలోని నారాయణమూర్తికి చెందిన బావిలో మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గునుగు పూల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.

సొంత ఖర్చులతో మరమ్మతులు

మల్లన్నపల్లి -ఘన్ముక్ల గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు వద్ద మరమ్మతులు చేయిస్తున్న మండల గట్టయ్య

వీణవంక, అక్టోబర్ 7: మండలంలోని మల్లన్నపల్లి-ఘన్ముక్ల గ్రామాల మధ్య ఒర్రెపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా దెబ్బతిన డంతో మల్లన్నపల్లి గ్రామానికి చెందిన మండల గట్టయ్య తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించి, పలువురికి ఆదర్శంగా నిలిచారు. మల్లన్నపల్లి-ఘన్ముక్ల గ్రామాల మధ్య ఒర్రెపై సుమారు 15 సంవత్సరాల క్రితం నిర్మించిన కల్వర్టు, ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో అటువైపు వెళ్లే రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో మల్లన్నపల్లి గ్రామానికి చెందిన మండల గట్టయ్య తన సొంత ఖర్చులతో జేసీబీని తెప్పించి, గుంతలను పూడ్చి మరమ్మతులు చేయించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

చిగురుమామిడి, అక్టోబర్ 7: మండలంలోని నవాబ్ పేట్-ఇందుర్తి సబ్ స్టేషన్‌లోకి వెళ్లే 33 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నవాబ్ పేట్, కొండాపూర్, సుందరగిరి, ఉల్లంపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో ఏఈ తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

అక్రమ నిర్మాణంపై ప్రజావాణిలో ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 7: బొమ్మకల్ గ్రామంలోని ఎస్సారెస్పీ డీ 94, 9ఆర్ కాలువ పరిసరాల్లో కొందరు బిల్డర్లు స్థలం ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని దొమ్మటి బాబు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే సర్వే నంబర్లు 28, 96 చెరువు కట్ట శిఖంలో అనుమతులు లేకుండానే గృహనిర్మాణాలు చేస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 7: హుజూరాబాద్ నాగార్జున డెయిరీలో హైదరాబాద్ రూట్ డ్రైవర్‌గా పని చేసే రవి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్ రావు మానవతా దృక్పథంతో రూ. 40 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని సోమవారం డెయిరీ సీఈవో కృష్ణ ప్రసాద్, ఏజీఎం సుధాకర్.. రవి భార్య, కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సంపత్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

ఇల్లందకుంట, అక్టోబర్ 7: పాతర్లపల్లి గ్రామానికి చెందిన అన్నం ప్రవీణ్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యువజన రాష్ట్ర కన్వీనర్‌గా నియమించినట్లు ఫోరం రాష్ట్ర వ్యవస్థాపకుడు గాట్టర్ చీమ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు.

కరెంట్ షాక్‌తో మేకలు మృత్యువాత

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 7: మేతకు వెళ్లిన రెండు మేకలు కరెంటు పోల్ షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శంషాబాద్ గ్రామ శివారులోని మందోని కుంట ప్రాంతంలో జరిగింది. కుంటలో ఉన్న ఓ ఇనుప కరెంటు పోల్ వైర్లల్లో పక్షులు గూళ్లు కట్టాయి. కరెంటు పోల్ నుంచి ఆ కుంట మొత్తంగా విద్యుత్ ప్రసారం కావడంతోనే ఆ కుంటలోకి వెళ్లిన రెండు మేకలు మృత్యువాత పడ్డట్లు స్థానికులు, గొర్ల కాపరి ఐలయ్య తెలిపాడు. దాదాపు రూ. 30 వేల విలువైన మేకలు కరెంటు షాక్‌కు గురై మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశాడు. మృతి చెందిన మేకలను పశు వైద్యశాఖ సిబ్బంది పరిశీలించి, వివరాలను తీసుకున్నారు.

లలితా త్రిపుర సుందరీ అలంకరణలో దుర్గాభవానీ


లలితా త్రిపుర సుందరీ అలంకరణలో అమ్మవారు

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 7: నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీ అలంకరణలో కామేశ్వరుడి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే చామనపల్లి, దుర్శేడ్ గ్రామాల్లోని భవానీ మండపాల వద్ద దీక్ష పరుల ఆధ్వర్యంలో మహా చండీ హోమం నిర్వహించారు.

గూడ్స్ వాహనం ఢీ కొని ఒకరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్ టౌన్,అక్టోబర్ 7: పట్టణ శివారులోని పరకాల క్రాస్ వద్ద ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాన్ని గూడ్స్ వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన జూపాక రమేశ్ తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వీరనారాయణపూర్‌కు వెళ్తుండగా, పరకాల క్రాస్ రోడ్ వద్ద గూడ్స్ వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో రమేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం ఇవ్వగా, అంబులెన్స్ సిబ్బంది హుజూరాబాద్ ఏరియా ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హోటళ్లపై దాడులు: 34 సిలిండర్లు స్వాధీనం

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 7: పట్టణంలో అక్రమంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వాడుతున్న హోటళ్లపై రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు కొరడా ఝుళిపించారు. ఆకస్మికంగా దాడులు జరిపి, అక్రమంగా నిల్వ ఉంచిన 34 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను హోటల్, బేకరీల నుంచి స్వాధీనం చేసుకున్నారు. వీటిలో అత్యధికంగా బస్టాండ్ సమీపంలోని నిర్వాణ హోటల్‌లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. ఆయా హోటల్స్, బేకరీల నిర్వాహకులపై కేసులు పెట్టి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో సివిల్ సప్లయి డీటీలు వసంతరావు, వినోద్, ఆర్ఐ శేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, అక్టోబర్ 7: లోయర్ మానేర్ జలాశయం నుంచి రెండో రోజు నీటి విడుదల కొనసాగుతున్నది. మిడ్ మానేర్ నుంచి ఇన్ ఫ్లో కొనసాగుతుండగా విడుదల కొనసాగిస్తున్నారు. మిడ్ మానేర్ నుంచి 10వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. రెండు గేట్ల నుంచి 5వేలు, కాకతీయ కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు వదులుతున్నారు. 24.034టీఎంసీల సామర్థ్యానికి పూర్తి స్థాయిలో నీళ్లు ఉన్నాయి.

కండక్టర్ కుటుంబానికి పరామర్శ

చిగురుమామిడి, అక్టోబర్ 7: మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ రాకం లింగమూర్తి ఇటీవల కరీంనగర్ బస్‌స్టాండ్‌లో గుండెపోటుతో మృతి చెందగా, సోమవారం ఆయన కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పరామర్శించారు. వారి వెంట సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బూడిద సదాశివ, నాయకులు బొల్లమల్ల రాజయ్య, బీస లక్ష్మి తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణకుంట పరిశీలన

చొప్పదండి, అక్టోబర్ 7: పట్టణంలోని బ్రాహ్మణ కుంట చెరువు ఎఫ్‌టీఎల్ శిఖం పరిధిని నీటిపారుదల శాఖ అధికారులు సుధాకిరణ్, కార్యనిర్వాహక ఇంజినీర్ రూప్లా నాయక్, ఉపకార్య నిర్వాహక ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు సోమవారం పరిశీలించారు. చెరువు శిఖం ఎఫ్‌టీఎల్ పరిధిని సమగ్ర సర్వేచేసి నివేదికను సమర్పించాలని కార్యనిర్వాహక ఇంజినీర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. శిఖం ఏరియా తర్వాత సుమారు 9మీటర్ల పరిధిలో చెరువు పరీవాహక ప్రాంతాల్లో ఎవరూ అక్రమ నిర్మాణాలు చేయవద్దని హెచ్చరించారు.

కోనోకార్పస్ చెట్లు తొలగించాలి

కలెక్టరేట్/తెలంగాణచౌక్, అక్టోబర్ 7 : మానవ మనుగడకు ముప్పు కలిగించే కోనోకార్పస్ చెట్లు జిల్లాలో వెంటనే తొలగించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, కోనోకార్పస్ చెట్ల మూలంగా శ్వాసకోశ వ్యాధులు, చర్మసంబంధ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇది గమనించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ మొక్కల పెంపకాన్ని నిషేధించిందని, హరితహారంలో నాటిన వాటిని కూడా తొలగించి, వాటి స్థానంలో వేరే మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించినట్లు గుర్తు చేశారు. అయినా, అటు అధికారులు గానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో టెలి కమ్యూనికేషన్, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లలోకి కూడా వీటి వేర్లు చొచ్చుకుపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కోనోకార్పస్ చెట్ల నిషేధాన్ని అమలు చేస్తూ, వాటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కల్లెపల్లి అరవింద్, కళ్యాణ్, మధుకర్, సంపత్, సుధీర్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 7: పట్టణ శివారులోని సిర్సపల్లిక్రాస్ రోడ్ వద్ద సోమవారం అక్రమంగా తరలిస్తున్న 10.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తనిఖీల్లో పట్టుకున్నట్లు హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యం విలువ రూ.18,900 ఉంటుందని చెప్పారు. రేషన్ బియ్యంతో పాటు వాటి తరలింపునకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేశామన్నారు. బియ్యం తరలిస్తున్న శంకరపట్నం మండలం మెట్టుపల్లికి చెందిన అంగిడి సుధాకర్, హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన రేవల్లి తిరుపతి, చెల్పూరుకు చెందిన మణెమ్మపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తోకలపల్లిలో..

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 7: హుజూరాబాద్ మండలం తోకలపల్లిలో అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేశారు. కందుగుల గ్రామానికి చెందిన గంట సంపత్, ముల్కనూర్ గ్రామానికి చెందిన తూర్పాటి తిరుపతి అనే ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హుజూరాబాద్ మండల పరిధిలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

చొప్పదండిలో..

చొప్పదండి, అక్టోబర్ 7: పట్టణంలో అక్రమంగా నిల్వ చేసిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంచిర్యాలకు తరలించడానికి బొలెరో పికప్ వాహనంలో లోడ్ చేస్తుండగా, సోమవారం ఉదయం టాస్క్ ఫోర్స్ కరీంనగర్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. బియ్యం అక్రమంగా నిల్వ చేసి, తరలిస్తున్న పట్టణానికి చెందిన బొల్లం జగదీశ్, పబ్బా శ్రీనివాస్, ఎలిగేటి నాగరాజు, వాహనం డ్రైవర్ దాసరి నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. అలాగే పబ్బా శ్రీనివాస్ ఇంటిలో మరో సుమారు 10 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు చెప